ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 64 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 14 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



### అరుణాచల్ సిఎంగా
## పెమా ఖండూ
### వరుసగా మూడోసారి ప్రమాణం

ఇటానగర్, జూన్ 13 (ప్రభాత ఉదయం): అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పెమా ఖండూ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగడం వరుసగా ఇది మూడోసారి. ఆయనతో పాటు ఉపముఖ్యమంత్రిగా బిజెపికి చెందిన చౌనా మే కూడా ప్రమాణస్వీకారం చేశారు. అరుణాచల్ ప్రదేశ్ కెటి పర్నాయక్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. పెమా ఖండూతో పాటు మరో 11 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఖండూ సహా మరో పది మంది క్యాబినెట్ మంత్రులు బియురామ్ వాహ్గే, న్యాటో దుకామ్, గాబ్రియేల్ డెన్వాంగ్ వాంగ్సు, వాంగ్కి లోవాంగ్, పసాంగ్ దోర్జీ సోనా, మామా నటుంగ్, దాసంగ్లు పుల్, బలో రాజా, కెంటో జిని మరియు ఓజింగ్ టేసింగ్ ఉన్నారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జెపి.నడ్డా, కిరణ్ రిజిజు, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## బక్రీద్ రోజు గోవధ నిషేధం
### అధికారులను ఆదేశించిన హైకోర్టు



హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం): బక్రీద్ పండగ సందర్భంగా గోవధ జరగకుండా చూడాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు గోవులను తరలించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. జంతు వధ చట్టం పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు హైకోర్టుకు ప్రభుత్వ తరఫు న్యాయవాది తెలిపారు. మూడు కమిషనరేట్ల పరిధిలో 150చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే గోవుల తరలింపుపై 60 కేసులు నమోదు చేసినట్లు హైకోర్టుకు న్యాయవాది తెలిపారు. ఎవరైనా జంతువుల అక్రమ వధకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

## జి 7 దేశాల సదస్సులో పాల్గొననున్న మోడీ
### ప్రధాని మోడీ ఇటలీ పయనం



న్యూఢిల్లీ, జూన్ 13 (ప్రభాత ఉదయం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీకి పయనమయ్యారు. ప్రధాని జార్జియా మెలోనీ ఆహ్వానం మేరకు ఆ దేశంలో ప్రారంభమైన జీ7 దేశాల వార్షిక సదస్సులో ఆయన పాల్గొన నున్నారు. కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే. దీనిపై ఆయన హర్షం వ్యక్తంచేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. జీ7 చర్చల్లో భాగంగా కృత్రిమ మేధ, ఇంధనం, ఆఫ్రికా, మధ్యధరా, గ్లోబల్ సౌత్ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే ఇతర నేతలతో భేటీ అయ్యేందుకు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఇటలీలోని బోర్గో ఎగ్నాజియా ప్రాంతంలోని ఓ లగ్జరీ రిసార్ట్‌లో జీ7 దేశాల సదస్సు (జూన్ 13-15) ప్రారంభమైంది. అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు జో బైడెన్, ఇమాన్యుయేల్ మెక్రాన్, జపాన్, కెనడా, బ్రిటన్ ప్రధానులు ఫుమియో కిషిదా, జస్టిన్ ట్రూడో, రిషి సునాక్, జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ తదితర నేతలు ఇప్పటికే అక్కడికి చేరుకున్నారు. జార్జియా మెలోనీ వారికి స్వాగతం పలికారు.

# దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెంచుతాం



### స్వయం సమృద్ధి సాధించేలా కృషి
### బాధ్యతలు స్వీకరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 13 (ప్రభాత ఉదయం): బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. విదేశాలపై ఆధారపడే రోజులు పోయేలా చూస్తామని అన్నారు. మోదీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని కిషన్‌రెడ్డి అన్నారు. అధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. దిల్లీలో గురువారం ఆయన కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మనం ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటున్నాం. రానున్న రోజుల్లో దిగుమతి తగ్గించి దేశీయంగా ఉత్పత్తి పెంచుతాం. ఖనిజాల అన్వేషణ, తవ్వకాల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తాం. బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖల అధికారులు ఒక బృందంగా నిబద్ధతతో పనిచేస్తాం కిషన్‌రెడ్డి చెప్పారు. బొగ్గు, గనుల శాఖ మంత్రి తనకు ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతలు అప్పగించారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దేశంలో విద్యుత్ లేకుండా, ఏ పని కూడా కాదని.. విద్యుత్ కోతల కారణంతో అనేక మంది రైతులు దేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మోదీ వచ్చిన తర్వాత విద్యుత్ కష్టాలు లేవన్నారు. పవర్ మినిస్ట్రీ, రైల్వే మినిస్ట్రీ, పర్యావరణ శాఖలకు, బొగ్గు గనుల శాఖకు అనుబంధం ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. అన్ని మంత్రిత్వ శాఖలను కలుపుకొని ముందుకు వెళ్తామని కిషన్ రెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మనకు కావాల్సిన బొగ్గును మనం ఉత్పత్తి చేసుకుంటామని వెల్లడించారు. ఉపాధి అవకాశాలు పెంచడంపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు అందరం పని చేయాలన్నారు. ప్రధాని మోదీ దేశ ఆకాంక్షలు కోసం ముందుకు వెళుతున్న ఆయనతో పాటు అందరూ నడవాలని

..మిగతా 2లో

### పాఠ్యపుస్తకాలను వాపస్ తెప్పించడం
## దారుణం
### ముందుమాటలో కెసిఆర్ పేరు ఉంటే తప్పేంటి
### డబ్బులు వృధా చేయడం తప్ప మరోటి కాదు
### ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డ సబిత, దేశపతి



హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం): తెలుగు పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరుంటే తప్పేంటని మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పక్క రాష్ట్రంలో జగన్ బొమ్మలతో కూడిన కిట్లను పిల్లలకు యధావిధిగా పంపిణీ చేయాలని, ప్రజాధనం వృధా చేయొద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ సీఎం చంద్రబాబు హుందాగా వ్యవహరించారు. ఆయనను చూసి నేర్చుకోవాలని రేవంత్‌కు సబిత చురకలంటించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలుగు పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరు ఉ ఒడడంతో ఆ పుస్తకాలను తిరిగి తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై సబిత స్పందించారు. కేసీఆర్ ఫొటో, కేసీఆర్ గుర్తు తొలగించాలనే ఆలోచనను

..మిగతా 2లో




## నీట్‌లో 1563 మందికి
## గ్రేస్ మార్కుల తొలగింపు
### వారికి మరోమారు పరీక్ష రాసే అవకాశం
### లేదంటే గ్రేస్ మార్కులు లేకుండా ఇంటర్వ్యూ
### సుప్రీంకు తెలియచేసిన కేంద్ర ప్రభుత్వం
### నీట్ కౌన్సిలింగ్‌పై స్టేకు సుప్రీం నిరాకరణ
### విచారణ జూలై 8కు వాయిదా

న్యూఢిల్లీ, జూన్ 13 (ప్రభాత ఉదయం): ఎంబీబీఎస్, బీడీఎస్..ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)- యూజీ 2024లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఫలితాల్లో 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను తొలగిస్తామని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తామని చెప్పింది. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో 1563 మంది విద్యార్థులకు అదనంగా గ్రేస్ మార్కులు ఇచ్చారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు, పరీక్ష కేంద్రాల వద్ద సమయం కోల్పోవడంతో వీటిని కలిపారు. అయితే దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో పాటు నీట్ పరీక్షలో అక్రమాలపై ఆరోపణలు రావడంతో గతవారం కేంద్ర విద్యాశాఖ నలుగురు సభ్యులతో కమిటీ వేసింది. కోల్పోయిన

..మిగతా 2లో

## ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న ప్రమాణం
### ప్రమాణం చేయించిన చైర్మన్ గుత్తా



హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రమాణ స్వీకారం చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సమక్షంలో ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ ఛాంబర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు ఏ పదవి చేయలేదని తనను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించిన అందరికి దన్యవాదాలని అన్నారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసిన గ్రాడ్యుయేట్లందరికి ధన్యవాదాలని బాధ్యత గలిగిన వ్యక్తిగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణా రావు, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంఛార్జి దీపా దాస్ మున్షీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంపై
## ఈడీ కేసు నమోదు

హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం): గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంపై ఈడీ కేసు నమోదు చేసింది. ఏసీబీ కేసు ఆధారంగా ఈడీ దర్యాప్తును ప్రారంభించింది. మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసింది. గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందని ఏసీబీ పేర్కొంది. కేసులో పదిమంది నిందితులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ కుంభకోణానికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని రాష్ట్ర అధికారులకు ఈడీ డైరెక్టరేట్ లేఖ రాసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద దీనిపై విచారణ చేపట్టనున్నామని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్కు హైదరాబాద్లోని ఈడీ జోనల్ కార్యాలయం సంయుక్త సంచాలకుడు లేఖ రాశారు. ఈ పథకానికి సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.

## ఎంసిఆర్ హెచ్ఆర్‌డిలో క్యాంప్ కార్యాలయం
### సిఎం రేవంత్ అనుమతితో కొత్త భవన నిర్మాణం



హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం): మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో అధునాతన వసతులతో సీఎం క్యాంప్ ఆఫీసు సిద్ధమవుతోంది. కమాండ్ కంట్రోల్‌లో తొలుత క్యాంప్ ఆఫీస్ చేద్దామనుకున్నా వద్దనుకున్నట్లు సమాచారం. గతంలో మానవవనరుల సంస్థలో క్యాంప్ కార్యాలయం ఉంటుందని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో కొత్తగా కొన్ని భవనాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఆరువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 1 భవనంగా దీనిని నిర్మిస్తున్నారు. మంత్రులు, సీనియర్ అధికారులతో సీఎం అత్యవసర సమావేశాలు

..మిగతా 2లో

## నీట్‌లో 1563 మందికి
# గ్రేస్ మార్కుల తొలగింపు

మొదటి పేజీ తరువాయి...

సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన 1563 విద్యార్థులపై ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. కమిటీ నిర్ణయాలను కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. 'కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయించింది. వారికి మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తాం. జూన్ 23న పరీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీలోగా వారి ఫలితాలను ప్రకటిస్తాం' అని ధర్మాసనానికి కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాతే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపింది. ఒకవేళ మళ్లీ పరీక్ష రాయొద్దని అనుకునే వారు.. గ్రేస్ మార్కులు లేకుండా ఒరిజినల్ మార్కులతో కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చని పేర్కొంది. ఇక, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. వెబ్ కౌన్సెలింగ్‌పై స్టే ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కౌన్సెలింగ్ యథాతథంగా ఉంటుందని చెప్పిన ధర్మాసనం.. ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగానే సమాధానం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. జులై 6వ తేదీ నుంచి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఇంత మంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు



ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే 'ఫిజిక్స్ వాలా' విద్యాసంస్థ వ్యవస్థాపకుడు అలఖ్ పాండే దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ విద్యార్థులకు ర్యాండమ్‌గా 70 నుంచి 80 మార్కులు కలిపారని అన్నారు. ఇదిలావుంటే
నీట్ పై సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వాగతించారు. నీట్ లో అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకుంటుందన్నారు. నీట్ పరీక్షలో సమస్యలకు కారణమైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విషయంలో.. రాజకీయాలు చేయొద్దని సూచించారు. 24 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు రాశారని చెప్పారు. వీరిలో 15వందల 63 మంది విద్యార్థులకు సంబంధించిన సమస్యను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. దేశంలో నీట్, ఏఇఇ, తదితర పరీక్షలను విజయవంతగా నిర్వహిస్తోందన్నారు
మరోవైపు 15వందల 63 మంది విద్యార్థుల గ్రేస్ మార్కులను తొలగిస్తున్నట్లు తెలిపింది. వీరికి జూన్ 23న మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. మళ్లీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈమెయిల్, మెసేజ్ ల ద్వారా సమాచారం అందిస్తామని తెలిపింది.



# దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెంచుతాం

మొదటి పేజీ తరువాయి...

కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు. దిల్లీలోని హోంశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

### కేంద్ర హెూంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్..

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్.. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లోని హెూంశాఖ కార్యాలయంలో బండి సంజయ్ బాధ్యతలు చేపట్టారు. భద్రతా కారణాల రీత్యా కార్యకర్తల అట్టహాసం, నాయకుల సందడి లేకుండానే ఛార్జ్ తీసుకున్నారు. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీజీ సమక్షంలో హెూం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో దేశ భద్రత కోసం పనిచేసేందుకు అహర్నిశలు కృషిచేస్తానని బండి సంజయ్ పేర్కొన్నారు.







# కాళేశ్వరంపై విచారణ వేగవంతం

## హరీష్ రావుకు నోటీసులు ఇచ్చే ప్రతిపాదన

హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం): కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బ్యారేజీల నిర్మాణంపై విచారణ ఊపందుకుంది. ఏజెన్సీలను అఫిడవిట్ ఫైల్ చేయమని కాళేశ్వరం కమిషన్ చైర్మన్ చీఫ్ జస్టిస్ చంద్రఘోష్ స్పష్టం చేశారు. ఆ అఫిడవిట్లపై విచారణ కొనసాగుతోందని వివరించారు. టెక్నికల్ అంశాలు సిద్ధమైన తర్వాత ప్రజా ప్రతినిధులకు నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత భారీ నీటిపారుదల శాఖా మంత్రి, ముఖ్యమంత్రిని విచారణకు పిలుస్తామని వెల్లడించారు. జూలై రెండో వారం లేదంటే ఆ తర్వాత విచారణకు పిలుస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావుకు త్వరలో నోటీసులు అందే అవకాశం ఉంది. ఆ తర్వాత కేసీఆర్‌కు ఇస్తారని తెలుస్తోంది. అంతకుముందు కాళేశ్వరం కమిషన్‌ను హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజనీర్లు కలిశారు. మధ్యంతర నివేదిక రెండు వారాల్లో సమర్పించాలని నిపుణులకు కమిషన్ స్పష్టం చేసింది. పూర్తిస్థాయి నివేదిక వీలయినంత త్వరగా అందజేయాలని రెండు కమిటీల ఇంజనీర్లకు కాళేశ్వరం కమిషన్ సూచించింది. టెక్నికల్ అంశాలకు సంబంధించిన విషయంలో అఫిడవిట్ ÷ల్ చేయాలని నిపుణుల కమిటీలకు కాళేశ్వరం కమిషన్ సూచించింది. త్వరలో మరోసారి ఫీల్డ్ విజిట్ చేస్తామని జస్టిస్ చంద్ర ఘోష్ వివరించారు. ఫిడవిట్ దాఖలు చేసిన ప్రతి ఒక్కరిని బహిరంగ విచారణలో భాగస్వామ్యం చేస్తామని కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్ర ఘోష్ స్పష్టం చేశారు. విజిలెన్స్ రిపోర్ట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కమిషన్ ఇప్పటికే కోరింది. విజిలెన్స్ రిపోర్ట్ అందకపోవడంతో మరోసారి ప్రభుత్వానికి లేఖ రాయనుంది. బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై టెక్నికల్ అంశాలు పూర్తయిన తర్వాత ఆర్థికపర అంశాల మీద కమిషన్ దృష్టిసారించే అవకాశం ఉంది.



# పగ, ప్రతీకార రాజకీయాలకు పరాకాష్ట

## 24 గంటల కరెంట్ ఇచ్చినందుకు కెసిఆర్‌కు నోటీసులా
## సిఎం రేవంత్‌కు దాసోజు బహిరంగ లేఖ

హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం): పగ ప్రతీకార రాజకీయాల కుయుక్తులకు పరాకాష్టగా సీఎం రేవంత్ రెడ్డి పాలన మారిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. ఆయన పాలన చాలా అధ్వాన్నంగా ఉందని విమర్శించారు. విద్యుత్ లోటుతో సతమతమవుతున్న రాష్ట్రానికి మిగులు విద్యుత్తు అందించి వెలుగులు విరజిమ్మే తెలంగాణగా తీర్చిదిద్దినందుకు కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులు ఇస్తారా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రైతాంగానికి 24 గంటలు ఉచిత విద్యుత్తు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపినందుకు కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులా అని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. ప్రతి ఇంటికి, ప్రతి పరిశ్రమకు నిరంతర విద్యుత్తు సరఫరా చేసి, అభివృద్ధికి దారితీసినందుకు కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులా అని నిలదీశారు. ప్రతీకార రాజకీయాలను పక్కనబెట్టి, ప్రజాసంక్షేమం కోసం కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. గత ప్రభుత్వంలో మాదిరిగా 24 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని ప్రజలను డిమాండ్ చేస్తున్నారని దాసోజు శ్రవణ్ తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, అభివృద్ధిని అడ్డుకునే మీ దుష్ప్రయత్నాలను విరమించాలని సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో వెలుగులు విరజిమ్మిన రాష్ట్రం, కరెంట్ లోటుతో సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితిని మీ ప్రతీకార రాజకీయాలతో మరింత కష్టతరం చేయడం సరికాదని హితవు పలికారు. హామీల అమలు చేతకాని గుంపు మేస్త్రీగా డివెర్షన్ పాలిటిక్స్ చేస్తూ సంజాయిషీల ప్రతీకార రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. రుణ మాఫీ, రైతు భరోసా, ఉద్యోగాలు, 4 వేల పెన్షన్, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు, మహిళకు 2500 రూపాయలు లాంటి పథకాలు అమలు చేయడం చేతగాక.. కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ కుయుక్తులను పక్కనబెట్టి రాష్ట్రాభివృద్ధి కోసం, సంక్షేమం కోసం ఆలోచనలు, కృషిని కేంద్రీకరించాలని సూచించారు. మీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ఆకాంక్షలను, వారి అభివృద్ధిని అణగదొక్కే ప్రయత్నాలను విరమించాలని హితవు పలికారు.





## ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో
# క్యాంప్ కార్యాలయం

మొదటి పేజీ తరువాయి...

నిర్వహించేందుకు వీలుగా ఈ భవనం రూపుదిద్దుకుంటోంది. జీ ప్లస్ 1 ప్లాన్ లో ఈ భవనం నిర్మిస్తున్నారు. ఇందులో సమావేశపు హాలు, నాలుగు సూట్లు, వంటగది ఉంటుంది. తక్కువ నిర్మాణ వ్యయంలో పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి సూచనల మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ ఈ క్యాంప్ ఆఫీసును నిర్మింపజేస్తున్నారు. వచ్చే 3-4 నెలల్లో క్యాంపు కార్యాలయం సిద్ధమవుతుందని అధికారులు తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జూబ్లీ హిల్స్ లోని తన నివాసం నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారిక, అనధికారిక సమావేశాలు అక్కడే నిర్వహిస్తున్నారు. సచివాలయంలో అధికారులతో రేవంత్ కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత కొద్ది రోజులుగా బంజారాహిల్స్ లోని రోడ్ నంబర్ 12లో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సీఎం సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇటీవల రుణమాఫీ పథకంపై అధికారులు, మంత్రులతో సీఎం రివ్యూ చేశారు. సీఎం నివాసానికి కేవలం 2 కి.మీ.ల దూరంలోనే ఉన్నందున, కార్యాలయ సమయాల్లో ట్రాఫిక్ నిలిచిపోవాల్సిన అవసరం ఉండదని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీని క్యాంపు కార్యాలయానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఇన్‌స్టిట్యూట్‌లో హెలిప్యాడ్ కూడా ఉంది, ఇతర ప్రాంతాల నుంచి నేరుగా అక్కడ దిగాలనుకున్నా అదీ ఉపయోగపడుతుందని సీఎం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇంతకుముందు సిఎంలు ఇన్స్టిట్యూట్‌లో గతంలో అనేక సమీక్ష సమావేశాలు నిర్వహించారని, కోవిడ్ -19 మహమ్మారి సమయంలో, కొత్త సచివాలయం నిర్మాణంలో ఉన్నప్పుడు ఈ భవన సముదాయం కీలక సమావేశాలకు ఉపయోగపడింది. ఈ భవనం పూర్తయితే ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం క్యాంప్ కార్యాలయం కొనసాగుతుంది..




# టీజీ లాసెట్, పీజీఎల్‌సెట్ 2024 ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం): టీజీ లాసెట్, పీజీఎల్‌సెట్ 2024 ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. మధ్యాహ్నం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, ఓయూ ఇంచార్జి వీసీ దాన కిశోర్ కలిసి ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలలను వెబ్‌సైట్ లింక్÷-లో అందుబాటులో ఉంచారు. లాసెట్, పీజీఎల్‌సెట్‌కు కలిపి 20,268 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 29,258 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. లాసెట్ ఫలితాల్లో 72.66 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. జూన్ 3వ తేదీన టీఎస్ లాసెట్ పరీక్షలను నిర్వహించారు. ఉదయం 9 నుంచి 10.30 వరకు మొదటి సెషన్ జరిగింది. ఇక మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు రెండో సెషన్, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు మూడో సెషన్ పరీక్షను నిర్వహించారు.



## పాఠ్యపుస్తకాలను వాపస్ తెప్పించడం
# దారుణం

మొదటి పేజీ తరువాయి...

పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టాలని రేవంత్‌కు సబిత సూచించారు. ఆరు నెలలైనా ఈ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించలేదు అనడానికి ఈ వ్యవహారమే ప్రత్యేక నిదర్శనం. తమిళనాడులో స్టాలిన్ ముఖ్యమంత్రి కాగానే జయలలిత ఫొటోతో ఉన్న బుక్స్, బ్యాగ్స్‌ను యథావిధిగా విద్యార్థులకు ఇచ్చి తమ హుందాతనాన్ని చాటుకున్నారు. పక్క రాష్ట్రం సీఎం చంద్రబాబు.. జగన్ బొమ్మతో గల కిట్లను పంపిణీ చేయాలని, ప్రజా ధనం వృథా చేయకండని ఆదేశించి ఎంతో హుందాగా వ్యవహరించారు. మరి మీ హుందాతనం ఎక్కడికి పోయిందని రేవంత్‌ను నిలదీశారు.విద్యార్థులకు ఇచ్చిన బుక్స్‌లో కేసీఆర్ పేరు ఉందని, బుక్స్ వెనక్కి తెప్పించడం, ఆ పేజీలను చింపేయడం, ఆ పేజీలపై మరో పేజీ అతికించడం సమంజసమా..? ఈ అనాలోచిత చర్యల వల్ల ప్రజాధనం వృధా కాదా..? చింపేసిన పేజీల వెనుకాల వందేమాతరం, జనగణమన గేయాలు, ప్రతిజ్ఞలు ఉన్న పట్టింపు లేదా..? కేసీఆర్ మీద కోపంతో జాతీయ గీతాన్ని కూడా అవమానిస్తారా..? ఈ ప్రభుత్వానికి ఇది తగునా..? అని సబిత ప్రశ్నించారు. తాము పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ ఆలస్యంగా అందించే సంస్కృతికి ముగింపు పలికి, ఆరు నెలల ముందు నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లి వాటిని విద్యార్థులకు అందించే ప్రయత్నం చేశామని సబిత గుర్తు చేశారు. తాము ఏటా 23 లక్షల మంది విద్యార్థులకు రూ. 108 కోట్లు వెచ్చించి రెండు జతల యూనిఫామ్స్, రూ. 200 కోట్లు వెచ్చించి 1.90 కోట్ల ఉచిత పుస్తకాలను ముద్రించి సకాలంలో అందించామన్నారు. ఇక రాష్ట్రంలో తొలిసారిగా ఏ ప్రభుత్వం చేయని విధంగా రూ. 34.70 కోట్లతో 11.27 లక్షల మందికి వర్క్ బుక్స్, రూ. 56.24 కోట్లతో 12.30 కోట్ల ఉచిత నోట్ బుక్స్ పంపిణీకి శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. విద్యార్థులందరికీ తాము జూన్ 12వ తేదీనే యూనిఫామ్స్, పుస్తకాలు అందజేశాం. ఈ ఏడాది బుక్స్‌తో పాటు బ్యాగ్స్ ఇవ్వమని కేసీఆర్ ఆదేశంతో విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇప్పటికైనా హుందాగా ప్రవర్తించండి. పాలన మీద దృష్టి పెట్టమని ఈ ప్రభుత్వానికి సలహా ఇస్తున్నాను అని సబిత పేర్కొన్నారు. ఇకపోతే సీఎం రేవంత్ సర్కార్ సంకుచిత రాజకీయాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని తెలుగు పుస్తకాల్లోని ముందుమాటలో కేసీఆర్ పేరుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతుందన్నారు. ఇప్పటికే విద్యార్థులకు పంపిణీ చేసిన 2 కోట్ల పుస్తకాలను మళ్లీ వెనక్కి తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దేశపతి శ్రీనివాస్ స్పందించారు. 2014లో కొత్త పుస్తకాలు రూపొందించలేదు.. పాత పుస్తకాలనే కొనసాగించాం. ఒక్క సంవత్సరం పాటు అవే పుస్తకాలను విద్యార్థులు చదువుకున్నారు. ఆనాడు ఉమ్మడి ఏపీలో ఉన్న సిలబస్‌నే చదువుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఎడిటర్లు, సీఎం, విద్యాశాఖ మంత్రి పేర్లు యథావిధిగా ఉన్నాయి. ముందుమాటలో కేసీఆర్ పేరు ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతోంది. దాదాపు 2 కోట్లకు పైగా పుస్తకాలు వాపస్ తెప్పించినట్లు వార్తలు వినిపిస్తున్నాయని దేశపతి పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ ముందుమాట కోసం కొత్త పుస్తకాలను ముద్రించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప ఒరిగేదేమీ లేదు. అనవసరపు నిర్ణయాలతో ప్రజా ధనం దుర్వినియోగం చేయొద్దు. ఇప్పుడున్న పుస్తకాలు మార్చే అవకాశం లేదు. మార్చాలంటే కొత్త కమిటీ ఏర్పాటు చేయాలి. ఇప్పటికిప్పుడు కొత్త కమిటీ ఏర్పాటు చేయడానికి సమయం లేదు. వచ్చే ఏడాది పుస్తకాలు మార్చుకోవచ్చు.. అప్పుడు మీ పేర్లు పెట్టుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొంచపు బుద్ధి ఉంది. విగ్రహాలు మార్చుడు, గుర్తులు మార్చుడు అనే ధోరణిలో ఉన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం సంకుచిత దృక్పథం వల్ల ప్రజా ధనం వృథా అవుతోంది. రేవంత్ రెడ్డి మాకు భేషజాలు లేవని అంటాడు మరి ఆయన చేసేది ఏంటి..? ప్రజాపాలన అంటూనే ప్రతి చిన్న విషయాల్లో కూడా సంకుచిత బుద్ధిని ప్రదర్శిస్తున్నారు అని దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి "తగ్గేదెలే"

### షాద్ నగర్ చౌరస్తాలో హీరో అల్లు అర్జున్ మాదిరి మేనరిజం
### రాజకీయ ప్రత్యర్థులకు తగ్గేదేలే అంటూ సవాల్

షాద్ నగర్,జూన్ 13 (ప్రభాత ఉదయం):తగ్గేదేలే అనే డైలాగ్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఫేమస్..ఈ మధ్యకాలంలో ప్రముఖ క్రికెటర్లు,సెలబ్రిటీలు,రాజకీయ నాయకులు ఎంతోమంది తగ్గేదేలే అంటూ తమ జోష్ ప్రదర్శిస్తున్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్.నవీన్ కుమార్ రెడ్డి గురువారం బీఆర్ఎస్ ర్యాలీ ప్రదర్శనలో హీరో అల్లు అర్జున్ మేనరిజం ప్రదర్శించారు.ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన తన సొంత నియోజకవర్గం షాద్ నగర్ పట్టణ కేంద్రానికి వచ్చారు.ఈ సందర్భంగా అభిమానులు భారీ గజమాల ఏర్పాటు చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వీరాభిమాని గుట్ట రాజు ఎమ్మెల్సీని ఘనంగా శాలువాతో సన్మానించారు.అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి "తగ్గేదేలే" అంటూ సిగ్నల్ ఇచ్చారు.రాజకీయంగా నవీన్ రెడ్డి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు.అనేక కేసులు ఆయనపై రాజకీయంగా నమోదై ఉన్నాయి.రాజకీయాల్లో పట్టుదలగా ఒక్కో మెట్టు పైకెక్కారు.పంతాలు,పట్టింపులు,పట్టుదలలు ఆయనకు సాధారణమే..ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా అనతికాలంలో పదవి సంపాదించారు.మరోవైపు భారత రాష్ట్ర సమితి అధినేత కెసిఆర్,కేటీఆర్ తదితర నాయకులకు పాలమూరు జిల్లాలో నవీన్ రెడ్డి ఎంతో దగ్గర అయ్యారు.అనతి కాలంలోనే బిఆర్ఎస్ పార్టీలో రాష్ట్రవ్యాప్తంగా పేరు సంపాదించుకుని సంచలన నాయకుడిగా నవీన్ రెడ్డి మారారు.ఎవరు ఊహించని విధంగా అతి తక్కువ కాలంలో ఎమ్మెల్సీగా నిలదొక్కుకోవడం మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి ఎంతో పెద్ద పదవి సంపాదించడంతో రాజకీయ విమర్శకులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.నవీన్ రెడ్డి ప్రదర్శిస్తున్న జోష్ అందులో తగ్గేదేలే అంటూ తన రాజకీయ శత్రువులకు చాలెంజ్ విసిరాడా? అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.



ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ని భారీ గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు




## బడి బస్సులు- తనిఖీలు చేపట్టిన రవాణా శాఖ అధికారులు

### నిబందనలు అతిక్రమించి నడుపుతున్న 30 బస్సులపై కేసులు నమోదు

రాజేంద్రనగర్,జూన్13(ప్రభాత ఉదయం) తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బడి బస్సులు బుధవారం రోడ్డెక్కాయి. విద్యార్థులను తరలించే ఈ బస్సుల్లో చాలావరకు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులపై రవాణాశాఖ అధికారులు కొరఢా ఝులిపించారు. దీంతో రంగంలోకి దిగిన రంగారెడ్డి జిల్లా ఆర్టిఏ అధికారుల ఆధ్వర్యంలో స్కూళ్లు ప్రారంభమైనా బుధవారం మొదటి రోజు నుంచే తనఖీలు ప్రారంభించారు.నిబందనలకు విరుద్ధంగా ఉన్న బస్సులపై కొరడా ఝులిపిస్తున్నారు.ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గురువారం రెండవ రోజు స్కూల్ బస్సుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రాజేంద్రనగర్,శంషాబాద్, చేవెళ్ల,బాలాపూర్, కొండాపూర్,మేడ్చల్,ఇబ్రహీంపట్నం వంటి ఏరియాల్లో ప్రైవేట్ స్కూల్ బస్సులపై దాడులు నిర్వహించారు. బస్సుల కండీషన్,ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఇన్సూరెన్స్,పర్మిట్ లను చెక్ చేసి ఫైన్లు వేశారు.కండిషన్ లేని పలు బస్సులను సీజ్ చేశారు.అలాగే బస్సు డ్రైవర్ లైసెన్స్ తో పాటు అటెండర్ లేని బస్సులపై చర్యలు తీసుకున్నారు. నిబందనలు అతిక్రమించి నడుపుతున్న 30 బస్సులపై కేసులు నమోదు చేశారు.


తీన్మార్ మల్లన్న ను సన్మానం చేస్తున్న మాజీ కౌన్సిలర్ కె ఎస్ దయానంద్

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్

బుద్వేల్, జూన్13(ప్రభాత ఉదయం): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను రంగారెడ్డి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ (డేవిడ్) గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తీన్మార్ మల్లన్నకు పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ప్రజా గొంతుక, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసన మండలి సభ్యులు కావడం సంతోషకారమన్నారు. అనంతరం కోరని దయానంద్ మాట్లాడుతూ...తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేయడం జరిగిందని,ఎన్నో కేసులు కూడా భరించారని అన్నారు. చివరికి తీన్మార్ మల్లన్నను అపహరించి జైలులో కూడా వేయడం జరిగిందన్నారు.పట్టభద్రులు అన్ని రకాల ఆలోచించి వరంగల్ ,ఖమ్మం,నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.



ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన నవీన్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

## నవీన్ రెడ్డి గెలుపు..... స్థానిక సంస్థల బలోపేతానికి మలుపు: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి , జూన్ 13(ప్రభాత ఉదయం) ఇటీవల మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికైన నవీన్ కుమార్ రెడ్డి ప్రమాణస్వీకారం సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బి.ఆర్.ఎస్ పార్టీ తరుపున స్థానిక సంస్థల ఎం.ఎల్.సిగా ఎన్నికైన నవీన్ రెడ్డి గురువారం శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక సంస్థల బలోపేతం వల్లనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని అన్నారు. కష్టకాలంలో పార్టీ గెలుపుకోసం కృషి చేసిన జెడ్ పి టి సి, ఎంపీటీసీ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ గెలుపులో కీలకపాత్ర పోషించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ని నవీన్ రెడ్డి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేసారు. నవీన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఎంఎల్ఏ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,ఎం. ఎల్.సి చల్లా.వెంకట్రామిరెడ్డి,మాజీ ఎం.పి రావుల.చంద్రశేఖర్ రెడ్డి,మాజీ మంత్రులుశ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి ,మాజీ ఎం.ఎల్.ఎలు అంజయ్య యాదవ్ , ఆల.వేంకటేశ్వర రెడ్డి,అభిలాష్ రావు పాల్గొనగా పలువురు మాజీ ఎం.ఎల్. ఎలు నవీన్ రెడ్డి నీ అభినందించారు.



## 10వ బెటాలయం అధికారిపై ఏసీబీ అధికారుల దాడి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 13(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా.. అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండల కేంద్రంలో 10 వ బెటాలయం కు సంబంధించిన అధికారి పై ఏసీబీ అధికారుల దాడి చేశారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రిటైర్డ్ ఏఆర్ఎస్ఎస్ఐ అబ్దుల్ వహాబ్ సహకారముతో ఒక పోలీసు కానిస్టేబుల్ మౌఖిక విచారణ జరిపి,అతనికి అనుకూలంగా వ్యవహరించడానికి యాభైవేలరూపాయలు లంచం తీసుకుంటు పట్టుబడ్డ అసిస్టెంట్ కమాండెంట్ వి.నరసింహ స్వామి పట్టుబడ్డారు . ఏసీబీ అధికారులు నరసింహస్వామి ని అరెస్టు చేసి నాంపల్లి కోర్టుకు తరలించారు.

## నామినేటెడ్ పదవుల కోసం ఆశలతో నాయకులు

బుద్వేల్, జూన్13(ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి పనిచేస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన సీనియర్ నాయకులు నామినేటెడ్ పదవుల కోసం ఆశతో ఉన్నారు. పార్టీ కి మొదటి నుంచి పనిచేస్తూ పార్టీ కష్ట కాలంలో కూడా రాజేంద్రనగర్ సర్కిల్ లో పార్టీని నడిపించిన తమకు ఈసారి ఎలాగైనా నామినేటెడ్ పదువుల్లో అవకాశం వస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టుకోవడమే కాకుండా అనేకమంది ఇతర పార్టీలో చేరినప్పటికీ తాము కాంగ్రెస్ లోనే ఉంటూ పనిచేశామని గుర్తు చేస్తున్నారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో ఒకరు రాజేంద్రనగర్ మున్సిపాలిటీకి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పనిచేసిన ఉప్పర్ పల్లి నివాసి సామ రాజ్ పాల్ రెడ్డి అయితే మరొకరు రెండు సార్లు మైలార్ దేవుపల్లి డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున కార్పొరేటర్ గా పోటీ చేసి ఓడిన సానెం శ్రీనివాస్ గౌడ్ లు. న్యాయంగా వీరికి పార్టీ కూడా మంచి పదవులు ఇస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ కి చెందిన మెజారిటీ నాయకులు, కార్యకర్తల వాదన కూడా.


సానెం శ్రీనివాస్ గౌడ్

**ముఖ్యమంత్రి ఆలోచించాలి :**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచించి సామ రాజ్ పాల్ రెడ్డి, సానేం శ్రీనివాస్ గౌడ్ లకు నామినేటెడ్ పదవులు కేటాయించేలా చూడాలని పలువురు నాయకులు కోరుతున్నారు.


సామ రాజ్ పాల్ రెడ్డి

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

### నిబంధనలు ఉల్లంఘిస్తే కూల్చివేస్తాం..
### నార్సింగి మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నార్సింగి,జూన్13(ప్రభాత ఉదయం) ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.నార్సింగి మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డిటిఎఫ్, హెచ్ఎండిఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు,సిబ్బంది సంయుక్తంగా వట్టినాగులపల్లి గ్రామంలోని సాయి తులసీ లేఅవుట్‌లో తాహేర్ ప్లాట్ నెంబర్ 12, సర్వే నెంబర్ 220లోని ఇంతియాజ్ ప్లాట్,శంకర్ హిల్స్ లేఅవుట్‌లోని లక్ష్మారెడ్డి,సయ్యద్ సర్వే నెంబర్ 96,97లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను పోలీసుల బందోబస్తు మధ్య గురువారం జేసీబీ సాయంతో కూల్చివేశారు.ఈ సందర్భంగా కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసినట్టు చెప్పారు.అనుమతులు లేకుండా, అనుమతుల ప్రకారం నిర్మాణం చేయకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.టీఎస్ బీపాస్ అనుమతుల ప్రకారమే భవనాలు నిర్మించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కూల్చివేస్తామని హెచ్చరించారు.


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న నార్సింగి మున్సిపల్ అధికారులు


జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ తో సమస్యలపై చర్చిస్తున్న కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్

## ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటాం

### కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి, జూన్ 13 (ప్రభాత ఉదయం) ప్రజా సమస్యల పరిష్కారంలో అటు ప్రభుత్వానికి ఎటు ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజలకు ఎప్పుడు కష్టం వచ్చినా వారికి నిరంతరం అందుబాటులో ఉంటామని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ నాయకులు, అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ని బుధవారం ఆమె కార్యాలయంలో కలిశారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నాలాలు, డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయని వాటికి సైడ్ వాల్స్, దానిపైన స్లాబ్ వేయడం, నాలాల్లో పూడిక తీయడం వంటి పనులపై రమేష్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించినట్లు రమేష్ తెలిపారు. సమస్యల పరిష్కారంలో స్థానిక సంక్షేమ సంఘాలు కూడా ప్రభుత్వ అధికారులకు సహకరించాలని జనరల్ కమిషనర్ స్థానిక నాయకులకు సూచించారు. వీటితోపాటు నియోజవర్గం లో కూరగాయల మార్కెట్ల ఏర్పాటు, చెత్త తరలింపు, పారిశుధ్య నిర్వహణ వంటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చిన రమేష్ అధిక నిధులు అవసరమైన పక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి తాము సమకూర్చగలమని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ, బి బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంను సందర్శించిన ప్రొబేషనరీ ఐఏఎస్‌లు


వ్యవసాయ విశ్వవిద్యాలయం ను సందర్శించిన ప్రొబేషనరీ ఐ ఏ ఎస్ లు


తెలంగాణకు కేటాయించబడిన ప్రొబేషనరీ ఐ ఏ ఎస్ లు

బుద్వేల్, జూన్13(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర క్యాడర్ కు కేటాయించబడిన ఐ ఏ ఎస్ ప్రొబేషనర్స్ బుధవారం సాయంత్రం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ను సందర్శించారు. పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో వారు రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామి రెడ్డి తో పాటు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ బోధన, పరిశోధనా, విస్తరణ విభాగాలలో చేస్తోన్న కార్యక్రమాలు, నిర్వహిస్తోన్న కోర్సులు తదితర అంశాల గురించి రిజిస్ట్రార్ వారికి వివరించారు. తెలంగాణ, వ్యవసాయం కు సంబంధించి పలు వివరాలు వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వి. అనిత, డాక్టర్ వి. సుధారాణి, డాక్టర్ జమునా రాణి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రావన్ కుమార్, డాక్టర్ ఎన్ పి రవి కుమార్, డాక్టర్ వి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడండి

## జడ్ పి చైర్మన్ సరిత తిరుపతయ్య



విద్యుత్ శాఖ అధికారులతో సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ సరిత, మున్సిపల్ చైర్మన్ కేశవ్

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 13(ప్రభాత ఉదయం)ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఇందుకోసం క్షేత్రస్థాయిలోని అధికారులు పటిష్టమైన ప్రణాళికతో వ్యవహరించాలని జెడ్పీ చైర్ పర్సన్ సరిత సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ నివాసంలో విద్యుత్ జిల్లా అధికారులతో జెడ్పి చైర్ పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బి.ఎస్. కేశవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గత కొంత కాలంగా పట్టణాలలో, గ్రామాలలో విద్యుత్ అంతరాయం వస్తుందని ప్రజలు తమ దృష్టికి నేరుగా, ఫోనుల ద్వారా సమాచారం అందించడం జరిగిందని ఎస్ఈ,డీఈ, ఏఈల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఈదురుగాలులు, వర్షాల నేపథ్యంలో గ్రామస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేసి ఎల్‌సీ తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండరాదని స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించి.. 24గంటలూ విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు, విద్యుత్‌పై దుష్ప్రచారం చేసేందుకు కుట్రలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవన్నారు. గతంతో పోల్చితే విద్యుత్ సరఫరా పెంచినప్పటికీ కోతలు పెడుతున్నారని దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులదేనన్నారు. సాంకేతిక, ప్రకృతిపరమైన కారణాలు మినహా ఉద్దేశపూర్వకంగా ఎవరైనా కోతలకు కారణమైతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇంటింటికీ ఉచిత విద్యుత్ జీరో బిల్లులు అమలు చేయాలని, ఎవరికైనా జీరో బిల్లులు రాని పక్షంలో గ్రామీణప్రాంతాలలోని లబ్ధిదారులు మండల ఎంపిడిఓ కార్యాలయంలో, మున్సిపాలిటీకి చెందిన వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేసుకునే విధంగా లబ్ధిదారులకు అవగహాన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అందించిన ఘనత కేసిఆర్‌దే

## కార్పోరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

### ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

కూకట్‌పల్లి, జూన్ 13 (ప్రభాత ఉదయం) ప్రవేట్ పాఠశాలలకు ధీటుగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలో భాగంగా పాఠశాలలు విద్యను అందిస్తున్నాయి అని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం బాలానగర్ డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా పదవ తరగతి లో అత్యుత్తమ మార్కులు తెచ్చుకున్న విద్యార్థి, విద్యార్థినులకు మంచి బహుమతి అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ యల్.శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ్ జ్యోతి తోపాటు బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, నాయకులు ఎలిజల యాదగిరి, శ్రీనివాస ముదిరాజ్, బాజని నాగేందర్ గౌడ్, ప్రేమ్ కుమార్, నాగరాజు గౌడ్, మానేపల్లి రాము, మహమ్మద్ సోఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల ( కేటిదొడ్డి),జూన్13(ప్రభాత ఉదయం) అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం కేటిదొడ్డి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపారు. కేటిదొడ్డి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూర్ మండలానికి చెందిన వడ్డే రవి చుట్టు పక్కల గ్రామాలలో తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని అధిక ధరకు విక్రయించడానికి అక్రమంగా రాయచూరుకు తరలిస్తున్న క్రమంలో పాతపాలెం గ్రామ శివారులో పోలీసులు టీఎస్ 33టి 4000 నంబర్ గల వాహానాన్ని తనిఖీ చేశారు. అందులో ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

## విద్యార్థులను చేర్పించాల్సిన బాధ్యత గ్రామ పెద్దలు,యువతదే: వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు

గద్వాల(కేటిదొడ్డి),జూన్13(ప్రభాత ఉదయం) విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు అన్నారు. గురువారం కేటిదొడ్డి మండలం కుచినెర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ యూనిఫార్మ్,పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఆయన అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ గోవిందమ్మ, మాజీ సర్పంచ్ హైమావతమ్మా, పాఠశాల హెచ్ఎం సుదర్శన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన ట్రాక్టర్

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గద్వాల(కేటిదొడ్డి),జూన్13(ప్రభాత ఉదయం) ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను గురువారం కేటిదొడ్డి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపారు. రాయచూరు జిల్లా కురువాపూర్ గ్రామానికి చెందిన రాములు టిఎస్33 టి 5351నంబర్ గల ట్రాక్టర్ లో కర్ణాటక నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో పాతపాలెం గ్రామ శివారులో పోలీసులు ట్రాక్టర్ ను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్ ను స్వాధీనపరచుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.





విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న వనపర్తి జిల్లా పరిషత్ జడ్పీ వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్

# విద్యతోనే సమాజంలో అసమానతలు తొలగుతాయి

## జెడ్పి వైస్ చైర్మన్ వామన్ గౌడ్

కొత్తకోట, జూన్ 13(ప్రభాత ఉదయం) విద్యతోనే సమాజంలో అసమానతలు కలుగుతాయని అందుకోసం పిల్లల తల్లిదండ్రులు విధిగా విద్యావంతులను చేయాలని వనపర్తి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్ అన్నారు. గురువారం కొత్తకోట మండలంలోని అపరాల గ్రామంలో హరిజనవాడలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోవిద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కూల్ డ్రెస్సులు, పుస్తకాలు ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్రెడ్డిలతో కలిసిజడ్పీ వైస్ చైర్మన్ వాహన్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా వామన్ గౌడ్ మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు చిట్టెమ్మ కేశవులు ,లక్ష్మీ గోవింద నాయుడు, వసంత రాజశేఖర్, సింగల్ విండో వైస్ చైర్మన్ వెంకటేష్, మాజీ సర్పంచ్ శంకర్, మాజీ ఎంపీటీసీ అనిత వీరేష్, నాయకులు , గాడిల ప్రశాంత్, నావర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మమత ను జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ లు సన్మానించారు.



సమస్యలపై పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### నాలా రిటర్నింగ్ వాల్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

కూకట్‌పల్లి, జూన్ 13 (ప్రభాత ఉదయం) ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని జింకలవాడ లో 90 లక్షలతో నిర్మిస్తున్న నాలా రిటర్నింగ్ వాల్ పనులను స్థానిక వెల్ఫేర్ అసోయేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, అధికారులు డిఈ శ్రీదేవి, ఏఈ పవన్ తో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. నాల రిటర్నింగ్ వాల్ వల్ల ఇండ్లు ప్రమాదకరంగా మారి ఇండ్లు కోల్పోయే పరిస్థితి వచ్చిందని సమస్యని స్థానికులు కార్పొరేట్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా నాలా రిటర్న్ వాళ్లు ఉంటేనే బాగుంటదని, అదే విధంగా కంపెనీల సైడ్ ఎక్కువ తీసుకొని తక్కువ తీసుకునే విధంగా ప్రజల తరఫున కూడా ఆలోచించమని కార్పొరేటర్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, సుదర్శన్ రెడ్డి, బాల నరసింహులురాములు, అంజి, రాజు, వెంకటేష్, ఫిరోజ్, సాయి, సాయి కుమార్, లక్ష్మణ్, వెంకటేష్, ఫరూఖ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లా రైస్ మిల్ అసోషియన్ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన విశ్వనాథం వెంకట రమణ



కొత్త కోట,జూన్13(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా రైస్ మిల్ అసోషియన్ ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథం వెంకట రమణ గురువారం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వెంకటరమణను కొత్తకోట మున్సిపాలిటి కేంద్రంలోని మున్సిపల్ చైర్పర్సన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్ నివాసంలో మాజీ జడ్పీటీసీ పొగాకు విశ్వేశ్వర్ ,ఐటిఐ చైర్మన్ విశ్వనాథం గంగాధర్ లు నూతనంగా ఎంపికైన వనపర్తి జిల్లా రైస్ మిల్లుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన విశ్వనాథం వెంకట రమణను శాలువతో సన్మానించి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



హాస్టళ్లకు వెళ్లే దారులకు మరమ్మత్తులు చేయాలని కలెక్టర్ బిఎస్ సంతోష్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

# హాస్టల్ల వద్ద రోడ్లు బాగు చేయండి: ఎమ్మెల్యే విజయుడు

### కలెక్టర్‌కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జూన్13(ప్రభాత ఉదయం) అలంపూర్ నియోజకవర్గం వివిధ మండలాలలో ఉన్న హాస్టల్ల కువెళ్లే రహదారులు బాగా లేవని వాటిని మరమ్మతు చేయించాలని ఎమ్మెల్యే విజయుడు గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎస్ సంతోష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో గతంలో నిలిచిపోయిన రోడ్లు భవనాల శాఖ రోడ్ల పనులను త్వరగా ప్రారంభించాలని ప్రజలకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేయాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కోరారు.

# ఆశ వర్కర్లకు నిర్వహిస్తున్న ఎగ్జామ్ రద్దు చేయాలి

కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న ఆశ వర్కర్లు







కలెక్టర్ బి ఎస్ సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 13(ప్రభాత ఉదయం)తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్ పిలుపుమేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లాలోని ఆశ వర్కర్లు అందరూ ధర్నా నిర్వహించి, కలెక్టర్ బిఎం సంతోష్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి వివి నరసింహ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో సమ్మె చేసిన సందర్భంగా ఆశ వర్కర్లు అప్పటి ప్రభుత్వం స్పందించి అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందువల్ల సమ్మెను వాయిదా వేయండి ఎన్నికల అయిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని రాతపూర్వకంగా యూనియన్ తో చర్చలు జరిపి చెప్పడం జరిగిందన్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో ఇచ్చిన హామీల అమలు చేయడంలో నిర్లక్ష్య పూరిత ధోరణిలో అవలంభిస్తుందన్నారు. అందులో బాగంగా కలెక్టర్ కార్యాలయం ముందర ధర్నా చేయడం చేపట్టిన్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశాలకు నిర్వహించడానికి తలపెట్టిన ఎగ్జామ్ రద్దు చేసి, పనికి తగ్గ పారితోషకాలు కాకుండా ఫిక్స్ వేతనం రూ.18 వేల ఇవ్వాలని, 2021 సంవత్సరంలో జీతాలు పెంచిన సందర్భంగా ఆరు నెలల ఏరియాస్ పెండింగ్లో ఉందని దాన్ని తక్షణమే ఇవ్వాలని, మూడు సంవత్సరాల నుంచి డ్రస్ అలవెన్సులు ఇవ్వడం లేదని వాటిని ఇవ్వాలని ఆశలు ప్రమాదం జరిగి మరణిస్తే రూ.50 వేల మట్టి ఖర్చులకు అలాగే ప్రమాద ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆశాల పైన జరుగుతున్న వేధింపులు అరికట్టాలని ప్రభుత్వ దావకానలో ఆశలకు రెస్ట్ రూమ్ ఏర్పాటు చేసి ఆశలకు తక్షణమే రిజిస్టర్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత, నాయకులు పద్మ కాంతమ్మ, మాధవి, సరస్వతి, సుజాత, విజయమ్మ, నాగేశ్వరమ్మ, మమత,నాగ ప్రమీల, జయమ్మ, సుజాత, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. “RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.